క్లుప్తంగా

కళాకారులకు సన్మానం

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెంలో సోమవారం ప్రాచీన కళాకారులకు సన్మానం చేశారు. గంగిరెద్దుల, హరిదాసు, అర్చకులను వేదికపై సన్మానించారు. స్థానిక నీల పళ్లాలమ్మ ఆలయం ప్రాంగణంలో ఆలయ కమిటీ ఈ సన్మానం చేసింది. పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మలకొలువు

పి.గన్నవరం: సంక్రాంతి పండగ సందర్భంగా వాడ్రేవుపల్లి శివారు చాకలిపాలెంలో న్యాయవాది మొల్లేటి శ్రీనివాస్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు విశేషంగా ఆకట్టుకుంది. సుమారు 200 కొండపల్లి బొమ్మలతో దీనిని ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో స్థానికులు బొమ్మల కొలువును తిలకించారు.

విఘ్నేశ్వరునికి పూజలు



ప్రభల ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయం సంక్రాంతి సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. స్వామిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తదితర ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రభల ఉత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ పాలకవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఏడీఎంహెచ్ఓగా సుమలత



కొత్తపేట/ఆలమూరు: నూతనంగా ఏర్పడిన కొత్తపేట డివిజన్ వైద్య ఆరోగ్య శాఖ అధికారి (అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ)గా డాక్టర్ మెంటే సుమలత నియమితులయ్యారు. ఆ మేరకు డీఎంఅండ్హెచ్ఓ ఎం.దుర్గారావుదొర ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ సుమలత గతంలో కొత్తపేట మండలం వానపల్లి పీహెచ్సీ వైద్యాధికారిగా పనిచేయగా ప్రస్తుతం ఆలమూరు మండలం చొప్పెల్ల పీహెచ్సీ వైద్యాధికారిగా పనిచేస్తున్నారు.

బుల్లితెర నటుడి సందడి



పాశర్లపూడిలంకలో సంప్రదాయ దుస్తులతో అలరించిన కల్కిరాజా కుటుంబ సభ్యులు

మామిడికుదురు: సంక్రాంతి పండగ సందర్భంగా టీవీ నటుడు కల్కిరాజా పాశర్లపూడిలంకలో సోమవారం సందడి చేశారు. మహిళలు సంప్రదాయ చీరకట్టుతో ఆకట్టుకున్నారు. ఇంటికి వచ్చిన హరిదాసుకు కానుకలు ఇచ్చారు. స్థానిక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు కుమారుడు కల్కిరాజా టీవీ నటుడిగా పలు సీరియల్స్లో నటించారు. కల్కిరాజా అటు నిర్మాతగా కూడా స్థిరపడ్డారు. అతని ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అలరించారు. కల్కిరాజాను చూసేందుకు స్థానికులు రావడంతో అక్కడ సందడి నెలకొంది. పురాతన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఈ సందర్భంగా కల్కిరాజా పేర్కొన్నారు.

గోశాలకు 140 కేజీల దాణా మిక్చర్ వితరణ

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలోని గోశాలకు కనుమ పర్వదినాన సోమవారం పలువురు దాతలు 140 కేజీల దాణామిక్చర్ను పంపిణీ చేశారు. ఉండికి చెందిన సేవా బృందం మెంబర్ నల్లా సత్యకిరణ్ ప్రసాద్, నర్సాపురానికి చెందిన జె.సత్యనారాయణమూర్తి, అంతర్వేదికరకు చెందిన రావి వాసు అందజేశారు. అలాగే మట్టపర్రుకు చెందిన సీహెచ్ పెద్దిరాజు, అంతర్వేదికరకు చెందిన రావి బాబూరావు, శిలారి రాజా, మోరిపోడుకు చెందిన కేఎస్ఎన్ మూర్తి మరో 100 కేజీల దాణా మిక్చర్ ఇచ్చారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి, సిబ్బంది జి.నరసింహశెట్టి, సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

గుండాట కేసులో ఇద్దరి అరెస్ట్

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో గుండాట నిర్వహిస్తున్న ఇరువురు నిందితులను పోలీసు ప్రత్యేక బృందం అరెస్ట్ చేసింది. ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం స్థానిక మెయిన్రోడ్డు సమీపాన గుండాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో జిల్లా ఎస్పీ సుధీర్కుమార్రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక బృంద అధికారి, రావులపాలెం ఎస్సై సురేందర్ నేతృత్వంలో దాడి చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.18 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అశ్లీల నృత్యాలపై కేసు

పి.గన్నవరం: జి.పెదపూడి గ్రామానికి చెందిన మంతెన రవిరాజు తన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం రాత్రి అశ్లీల ప్రదర్శనలు ఏర్పాటు చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి.గంగాభవాని విలేకరులకు తెలిపారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి రవిరాజుపై నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆమె వివరించారు.



వాకలగరువులో కొలువుదీరిన వాకలగరువు, తొండవరం ప్రభలు



మామిడికుదురు శివారు కొర్లగుంటకి ప్రభను తీసుకువస్తున్న భక్తులు



తూర్పుపాలెంలో ప్రభల ఊరేగింపు



అయినవిల్లి నుంచి ముక్తేశ్వరం తరలివెళ్తున్న ప్రభలు

కనులపండువగా ప్రభల తీర్థం

- భక్తులతో కిక్కిరిసిన జగ్గన్నతోట
- కోలాహలంగా ప్రభల ఊరేగింపు



కొత్తపేటలో ప్రభను ఎత్తుకుని ఊరేగింపు పునః ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



జగ్గన్నతోటలో ప్రభల తీర్థానికి హాజరైన భక్త జనం

అంబాజీపేట/కొత్తపేట/మామిడికుదురు/అయినవిల్లి/మలికిపురం/పి.గన్నవరం: అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో సోమవారం నిర్వహించిన ప్రభల తీర్థం కనులపండువలా సాగి భక్తజనంతో కిక్కిరిసిపోయింది. ఎంతో పవిత్రమైన సోమవారం కావడంతో ఏకాదశ రుద్రులను దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచే ఈ తీర్థానికి వేలాదిగా పోటెత్తిన భక్తులు ప్రభలకు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. ఇరుసుమండ, కె.పెదపూడి, మొసలపల్లి నుంచి జగ్గన్నతోటకు దారి తీసే రోడ్లన్నీ కిటకిటలాడాయి. జగ్గన్నతోట తీర్థంలో కొలువుదీరిన ప్రభలు వివిధ రకాల అలంకరణలతో భక్తులకు కనువిందు చేశాయి. గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, కె.పెదపూడి, వ్యాఘ్రేశ్వరం, ఇరుసుమండ, వక్కలంక, నేదునూరు, ముక్కామల, మొసలపల్లి, పాలగుమ్మి, కముజువారిలంక ప్రభలు తరలి వచ్చాయి. రుద్రరూపానికి ప్రతీకలైన ప్రభలపై కొలువుదీరిన తమ ఇష్టదైవాలను విశేషాలంకరణలతో ముస్తాబు చేశారు. అనంతరం భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వాకలగరువు 52, తొండవరం 52 అడుగుల ప్రభలు చూపరులను కనువిందు చేశాయి. ప్రభల వెంట, ప్రభలు వచ్చే రహదారుల లోను, తీర్థం జరిగే ప్రాంతాల్లో కొత్తపేట డీఎస్పీ రమణ, సీఐ డి.ప్రశాంత్కుమార్, ఎస్సై వి.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించడం, కమిటీ సభ్యులు, ప్రజల సహకారంతో తీర్థం ప్రశాంతంగా ముగిసింది. అలాగే మామిడికుదురు శివారు కొర్లగుంటలో తీర్థ స్థలిలో ఏర్పాటు చేసిన ప్రభలను వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. పెదపట్నం, మామిడికుదురు, పాశర్లపూడి, నగరం, ఈదరాడ గ్రామాలకు చెందిన ప్రభలు కొర్లగుంటలో కొలువుదీరాయి. పెదపట్నం నుంచి ఎక్కువ ప్రభలను ఇక్కడకు తీసుకువచ్చారు. పెదపట్నం నుంచి తీసుకువచ్చిన ప్రభలను భక్తులు హర... హరా... అంటూ పంట కాలువలో పీకల లోతు నీటిలో దిగి తీసుకు వచ్చిన దృశ్యాలు భక్తులను తన్మయత్వానికి గురి చేశాయి. ఈ కనువిందైన దృశ్యాలను చూసేందుకు భక్తులు ఏటిగట్టుపై బారులు తీరారు. ప్రభలను తీర్థ స్థలికి తీసుకువచ్చేటప్పుడు, తీర్థం ముగిసిన తర్వాత ప్రభలను తిరిగి పెదపట్నం తీసుకు వెళ్లే సమయంలోను ఇవే దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు నగరంలో ప్రభను దర్శించుకుని పూజలు చేశారు. మండలంలోని మొగలికుదురు, గెద్దాడ గ్రామాల ప్రభలను రాజోలు మండలం పొదలాడ తీర్థస్థలికి తీసుకువెళ్లారు.

'ప్రభ'వించిన వైభవం

కోనసీమలో సంక్రాంతి, కనుమ ప్రభల ఉత్సవాలు వైభవంగా సాగాయి. రాష్ట్రంలో ముఖ్యంగా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ప్రభల ఉత్సవాలు కనుమ పండుగనాడు జరుగుతుండగా కొత్తపేటలో మాత్రం అందుకు భిన్నంగా మకర సంక్రాంతి రోజు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉభయ తెలుగు రాష్ట్రల స్థాయిలోనే ప్రాముఖ్యత సంతరించుకున్న కొత్తపేట ప్రభల ఉత్సవం ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకూ 24 గంటల పాటు శ్రవణనయనానందకరంగా సాగింది. పాత రామాలయం వీధికి చెందిన ప్రధాన (మునసబుగారి) ప్రభ వీరభద్రస్వామిని, కొత్తరామాలయం వీధికి చెందిన ప్రధాన (కొత్తరామాలయం) ప్రభ రాజరాజేశ్వరీదేవిని అలంకరించుకోగా ఆయా వీధులకు చెందిన 12 ప్రభలు వివిధ దేవతా మూర్తులను అలంకరించుకున్నాయి. వేలాది మంది భక్తులు ప్రభలను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉర్రూతలూగించిన బాణసంచా కాల్పులు

సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకూ వరుసగా బోడిపాలెం, పాత, కొత్తరామాలయం వీధుల వారు భారీగా బాణసంచా కాల్పులు నిర్వహించారు. మరలా రాత్రి 10 గంటలకు ఊరేగింపు తిరిగి ప్రారంభం కాగా రంగురంగుల విద్యుద్దీపాల కాంతులు, బ్యాండు వాయిద్యాలు నడుమ అర్ధరాత్రి 2 గంటలకు పాత బస్టాండ్ సెంటర్కు చేరుకుంది. ఈ ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన పాత, కొత్త రామాలయం వీధుల బాణసంచా కాల్పులు భూమిపైనే కాక గగన వీధుల్లో విన్యాసాలు చేశాయి. రాత్రి 2 నుంచి ఉదయం 5 గంటల వరకూ భారీ ఎత్తున వివిధ రకాల బాణసంచా గగన వీధుల్లో విన్యాసాలు, దరిచేరిన వారిని పరుగులు పెట్టించే మిడతలదండ్లు, బుసలు కొట్టే సర్పాలు, మల్లె పందిర్లు, రంగురంగుల కాంతులు విరజిమ్మే ఈతచెట్లు తదితర బాణసంచా నయనానందకరంగా కనువిందు చేశాయి. సుమారు రూ.15 లక్షలు విలువైన 30 రకాల బాణసంచా కాల్చారు. స్థానిక డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో రావులపాలెం ఎస్సై ఎస్.రజనీకుమార్ ఆధ్వర్యంలో కొత్తపేట ఎస్సై వీ మణికుమార్, కోనసీమలో పలువురు సీఐలు, జిల్లా వ్యాప్తంగా వివిధ స్టేషన్ల ఎస్సైలు, సిబ్బంది, ఎస్పీఎఫ్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.

రోడ్డుపై నిలిచిపోయిన ప్రభలు

పోలీసులకు, ఉత్సవ కమిటీలకు మధ్య వివాదంతో నిలిచిపోయిన ప్రభల ఊరేగింపు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రాకతో పునఃప్రారంభించారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్కు చేరుకున్న జగ్గిరెడ్డికి ఉత్సవ కమిటీల తరపున అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు ముత్యాల వీరభద్రరావు, సభ్యులు ఘనస్వాగతం పలికి ప్రభల వద్దకు తోడ్కొని వెళ్లారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రధాన ప్రభను తన భుజస్కంధాలపై ఎత్తుకుని ఊరేగింపు ప్రారంభించారు. నిర్వహకుడు ముత్యాల వీరభద్రరావుతో పాటు ఇతర కమిటీలను ఆయన అభినందించారు. అలాగే అయినవిల్లి మండలంలోని పరిసర గ్రామాల్లో ప్రభల ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయినవిల్లి, వెలవలపల్లి, చింతనలంక, మడుపల్లి, విలస, సిరిపల్లి, తొత్తరమూడి, అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి, వేమవరం ప్రభలను ఊరేగింపుగా మండల కేంద్రమైన ముక్తేశ్వరంలోని ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వర ఆలయం వద్దకు చేరుకున్నాయి. అక్కడ భక్తుల దర్శనార్థం కొలువు దీరాయి. చుట్టు పక్కల ప్రాంతాలతో నుంచి అధిక సంఖ్యలో భక్తులు ప్రభల ఉత్సవాన్ని తిలకించడానికి విచ్చేశారు. ముక్తేశ్వరం ప్రధాన కూడలిలో భక్తులతో జనసంద్రంగా మారింది. పోలీసు, రెవెన్యూశాఖలు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాయి. వీరవల్లిపాలెం, మాగాం, కొండుకుదురు, కె.జగన్నాథపురం, పోతుక్రురు, క్రాప గ్రామాల్లో ప్రభల ఉత్సవం ఘనంగా జరిపారు. నేదునూరు ప్రభ అంబాజీపేట మండలంలోని జగ్గన్నతోటలో ఉత్సవానికి ఊరేగింపుగా బయలుదేరి వెళ్లింది. మలికిపురం మండలంలో సోమవారం కనుమ సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. కేశనపల్లి, తూర్పుపాలెం, పడమటిపాలెం గ్రామాల్లో ప్రభల ఉత్సవాలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో వేంచేసిన నీల పళ్లాలమ్మ ఆలయం వద్దకు భారీ ఎత్తున ప్రభలు ఊరేగింపుగా చేరాయి. మూడు మండలాల సరిహద్దులో ఉన్న కుందాలపల్లి డ్యామ్ సెంటర్లో సంక్రాంతి ప్రభల తీర్థం సోమవారం కనులపండువగా జరిగింది. పి.గన్నవరం, అంబాజీపేట, కొత్తపేట మండలాల నుంచి సుమారు 50కి పైగా ప్రభలను తీర్థానికి తీసుకువచ్చారు. పి.గన్నవరం మండలం నరేంద్రపురం, పప్పులవారిపాలెం, కుందాలపల్లి గ్రామాల నుంచి ప్రభలను పంట కాలువ దాటించి తీర్థస్థలికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామానికి చెందిన ప్రభలను రెండు కిలోమీటర్ల మేర పంట చేల మీదుగా భక్తులు భుజాలపై మోసుకువచ్చారు. డ్యామ్ సెంటర్లో కొలువుదీరిన ప్రభలను వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పి.గన్నవరం ఎస్సై పి.గంగాభవాని ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రభల తీర్థాన్ని సందర్శించిన ముస్లింలు

అంబాజీపేట: సుమారు 410 ఏళ్ల పైబడి చరిత్ర కలిగిన ఏకాదశ రుద్రుల ప్రభల తీర్థాన్ని తెలంగాణలోని కోదాడ నుంచి ముస్లిం కుటుంబ సభ్యులు తరలివచ్చారు. అమలాపురం కుమ్మరి కాలువ సమీపంలో నివాసముంటున్న ముర్తజా బంధువులు ఇంటికి ముస్తఫా కుటుంబ సభ్యులు వచ్చారు. ప్రభల తీర్థం విశిష్టతను తెలుసుకుని సందర్శించేందుకు ఇక్కడకు వచ్చినట్లు పేర్కొన్నారు. తీర్థం జరిగిన తీరు, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలు అప్పర కౌశిక నది దాటి తీర్థానికి తరలివచ్చిన తీరు తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతరలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ దేవతల జాతర, తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలమూరులోని నాగులచెరువు వద్ద వేంచేసిన రావులమ్మ, మడికిలో వేంచేసిన పోలేరమ్మ అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లకు నిర్వహించిన గ్రామోత్సవంలో గరగ రూపంలో అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేశారు. పెదపళ్ల, నవాబుపేట, మడికి గ్రామాల్లో కాళీకామాత నృత్యాలు, విచిత్ర వేషధారణలు పాటు సంగీత విభావరి అలరించాయి. అలాగే నవాబుపేటలో పోలేరమ్మ ఆలయం వద్ద నిర్వహించిన గరగ నృత్యాలు, సంగీత విభావరి అలరించాయి. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గుమ్మిలేరు ఉరదాలమ్మ, పినపళ్ల ధనలక్ష్మి ఆలయం వద్ద తీర్థం వైభవంగా జరిగింది. స్థానిక ఎస్సై ఎస్.శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బృందం గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కేశవదాసుపాలెంలో..

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో వేంచేసిన మారెమ్మ వారి జాతర ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద మొదలైన జాతరలో గరగ నృత్యాలు భక్తులను భక్తిపారవశ్యంలో ఓలలాడించాయి. అలాగే బుట్టబొమ్మలు, బ్యాండు వాయిద్యాలు, బాణసంచా కాల్పులు స్థానికులను ఆకట్టుకున్నాయి. గ్రామంలో జరిగిన ఈ జాతర సందర్భంగా భక్తులు అమ్మవారికి అరటిపళ్లు, కొబ్బరికాయలు నైవేద్యంగా సమర్పించారు.

సందడే సందడి..



పుల్లేటికుర్రులో అయ్యగారి వారి కుటుంబం



సోంపల్లిలో కలుసుకున్న గెద్దాడ కుటుంబ సభ్యులు

అంబాజీపేట: ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర వృత్తుల కోసం చెట్టుకొకరు, పుట్టకొకరుగా విడివడి కుటుంబపు అనుబంధాలు, ఆనందాలను ఆస్వాదించలేని వారు ఎందరో. ఇటువంటి వారికి సంక్రాంతి పండగ అనుభూతిని పంచుకుంటుంది. అలాంటి అనుభూతిని పొందుతున్న వారే పుల్లేటికుర్రుకు చెందినచ అయ్యగారి లక్ష్మీవెంకాయమ్మ, ఉమ్మన్నల కుటుంబ సభ్యులు. బంధుమిత్రులతో ఐదు తరాలకు చెందిన వారంతా కలసి సంతోషంగా గడపాలంటే ఇళ్లల్లో ఏదైనా శుభకార్యం జరగాల్సిందే. అన్నదమ్ములు, తోడికోడళ్లు, ఆడపడుచులు, బావలు, అల్లుళ్లు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లు, మునిమనవళ్లు అందరూ కలసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, విందు భోజనం చేస్తూ, చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఎంతో ఆనందంగా ఉంటుంది. కానీ ప్రస్తుత రోజుల్లో తామందరం యాంత్రిక జీవనం గడుపుతున్నామని ఆ లోటును సంక్రాంతి పండగ తీరుస్తుందని లక్ష్మీవెంకాయమ్మ, ఉమ్మన్నల కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయ్యగారి వంశ వృక్ష సభ్యులంతా ఆదివారం సంక్రాంతి పురస్కరించుకరుని పుల్లేటికుర్రు చౌడేశ్వర సంక్షేమ సంఘ భవనంలో సుమారు 70 మంది కుటుంబ సభ్యులు కలుసుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు, తమిళనాడు తదితర సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులు ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి తమ గ్రామం చేరుకున్నారు. అల్లుళ్లు, కూతుళ్లు, మనుమలు, మనువరాళ్లతో ఆ కుటుంబం కళకళలాడింది. కన్వీనర్ బెహరా హనుమంతరావు, వెంకట సత్యసూర్యకుమారిల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో బంవారు వెంకట సుబ్బారావు, లక్ష్మి, అయ్యగారి శ్రీనివాసరావు, రోజారమణి దంపతులతో పలువురు పాల్గొన్నారు.

'గెద్దాడ' వారి ఆత్మీయ సమ్మేళనం

రాజోలు: సోంపల్లి గ్రామానికి చెందిన గెద్దాడ కుటుంబ సభ్యులు సుమారు 400 మంది ఒకేచోట కలిశారు. నాలుగు తరాలకు చెందిన కుటుంబ సభ్యులంతా కలసి ఆటపాటలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం ఆకట్టుకుంది. రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి గెద్దాడ సుబ్బారావు మాట్లాడుతూ భావితరాలకు కుటుంబ సాంప్రదాయాలు అలవర్చేందుకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలన్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కుటుంబ సభ్యులంతా కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

మామిడికుదురు: సంక్రాంతి పురస్కరించుకుని ఈదరాడలో కాలువగట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో యెరుబండి వెంకటరమణమూర్తి, అడబాల శంకరబంగార్, యెరుబండి నాగేశ్వరరావు, యెరుబండి పేరయ్యనాయుడు, ఎ.వెంకటరమణ పాల్గొన్నారు.

కోనసీమ స్థాయి కబడ్డీ, ముగ్గుల పోటీలు

పి.గన్నవరం: బెల్లంపూడి గ్రామంలో సర్పంచ్ బండి మహాలక్ష్మి, మహాలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోనసీమ స్థాయిలో కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కబడ్డీలో రావులపాలెం, ఊబలంక, జొన్నల్లంక జట్లు ప్రథమ, ద్వితీయ, స్థానాలను సాధించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ బండి రమేష్, తాడాల వెంకటేశ్వరరావు, ఆదిమూలం వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో మాచవరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి పర్యవేక్షణలో సోమవారం ఏర్పాటు చేసిన ముగ్గులు పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో నాగాబత్తుల సుబ్బారావు, సుంకర పేరయ్యనాయుడు, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జాతి సాహివాల్ దూడ జననం



ఆలమూరు: పంజాబ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో పెరిగే సాహివాల్ జాతి ఆవు దూడ మండలంలోని జొన్నాడలో జన్మించింది. గ్రామ ఉపసర్పంచ్ నాంద్ర నాగమోహన్రెడ్డి పశువుల మకాంలో ఆదివారం రాత్రి కపిల ఆవుకు సాహిదార్ జాతి పెయ్యి దూడ పుట్టింది. హైదరాబాద్లోని పశుసంవర్ధకశాఖ అధికారుల సహకారంతో సెమన్ను తీసుకువచ్చి కపిల ఆవుతో సంపర్కం చేశారు. తొలిఈతలో ఆ ఆవుకు పుంగనూరు దూడ జన్మించగా రెండో విడతలో సాహివాల్ జాతి దూడకు జన్మనిచ్చింది. తేనె రంగులో చూడముచ్చటగా ఉండే ఈ ఆవులో వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉండటంతో పాటు సమశీతోష్ణస్థితిని తట్టుకుని అధిక పాలదిగుబడి ఇస్తుందని వైద్యాధికారి వినోద్కుమార్ పేర్కొన్నారు.

గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం



గరుడ పుష్పక వాహనంపై స్వామి గ్రామోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో కనుమ పర్వదినాన సోమవారం స్వామి, అమ్మవార్లను గరుడ పుష్పక వాహనంపై అర్చకులు గ్రామోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఆలయం నుంచి పల్లకీలో లక్ష్మీ నృసింహస్వామి, అమ్మవార్లను అలంకార మండపానికి తోడ్కొని వచ్చారు. అక్కడ స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు ఉత్సవమూర్తులను పూలతో అలంకరించి మంగళ హారతులు ఇచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ కొబ్బరికాయ కొట్టి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. అరటిపళ్ళు, కొబ్బరికాయలు నైవేద్యంగా సమర్పించుకున్నారు. అర్చకులు వారికి ఆశీర్వచనాలు ఇచ్చారు.

లక్ష్మీనృసింహుని జన్మనక్షత్ర పూజలు

అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని సోమవారం స్వామివారికి అష్టోత్తర శతకలశాభిషేకం అర్చకులు నిర్వహించారు.

సహచర పూర్వ విద్యార్థికి ఆర్థిక సాయం

కొత్తపేట: నాడు తమతో కలసి చదువుకున్న పూర్వ విద్యార్థి అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా అతడికి సహచర పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. మండలంలోని అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-93 బ్యాచ్ విద్యార్థుల్లో పప్పులవారిపాలేనికి చెందిన తోట నరసింహారావు అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆ బ్యాచ్లో విద్యార్థులు 48 మంది సహచరల నుంచి రూ.67 వేలు సేకరించారు. సంక్రాంతి సందర్భంగా స్వగ్రామాలకు వచ్చిన పలువురు పూర్వ విద్యార్థులు ఆ మొత్తాన్ని నరసింహారావుకు అందజేశారు. ఎప్పుడూ నీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వివిధ రంగాల్లో స్థిరపడిన ఆ విద్యార్థులు గతంలో తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధితో కష్టాల్లో ఉన్న సహచరులకు ఆర్థికంగా తోడ్పడ్డారు. తాజాగా నరసింహారావుకు ఆర్థిక సాయం చేయడంపై ఆ కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.